# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-03-2026 సమయం : సాయంకాలం 6 గం.10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలోని ప్రతీ ఇంటికీ తాగునీటి కుళాయి సౌకర్యాన్ని కల్పిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ సింహాచలం చందనోత్సవ వేడుకలలో సామాన్య భక్తులకు ప్రాధాన్యత కల్పించాలని విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అధికారులను ఆదేశించారు.
- ❖ విద్యుత్ కొనుగోలు ఛార్జీలను తగ్గించే అంశంపై అధికారులు దృష్టి సారించాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు.
- ❖ కృత్రిమ మేధ సహాయంతో క్షయవ్యాధిగ్రస్తులను గుర్తిస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.
- ❖ రాష్ట్రంలో పామ్ ఆయిల్ మిల్లుల ఆధునికీకరణకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి కోరారు.

==================

జల్ జీవన్ మిషన్ 2.0 కింద 2028 నాటికి రాష్ట్రంలోని ప్రతీ ఇంటికీ తాగునీటి కుళాయి లక్ష్యాన్ని సాకారం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్ 2.0పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఢిల్లీలో కుదిరిన అవగాహన ఒప్పందం కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఉండవల్లిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి దృశ్య మాధ్యమం ద్వారా ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థలో ఆపరేషన్, మెయింటెనెన్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థల నిర్వహణ బాధ్యతను పంచాయతీలకు అప్పగించామని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అనంతరం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీ.ఆర్. పాటిల్ మాట్లాడుతూ... ప్రతీ ఇంటికీ సురక్షిత తాగునీరు చేరటమే వికసిత్ భారత్ - 2047 లక్ష్యమని చెప్పారు. జల్ జీవన్ మిషన్ కార్యక్రమం మొదటి దశలో 16 కోట్ల గృహాలకు కుళాయిలు ఇచ్చామని తెలిపారు. రానున్న కాలంలో మరో 3 కోట్ల ఇళ్లకు సురక్షితమైన తాగు నీటిని అందించాల్సి ఉందని కేంద్రమంత్రి వెల్లడించారు.

=================

సింహాచలంలో జరిగే చందనోత్సవ వేడుకలలో సామాన్య భక్తులకు ప్రాధాన్యత కల్పించాలని విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 20వ తేదీన జరిగే శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి చందనోత్సవ వేడుక నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లపై విశాఖలోని కలెక్టరేట్ సమావేశం మందిరంలో మంత్రి ఈ రోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... చందనోత్సవం సజావుగా సాగేందుకు అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. టిక్కెట్ల జారీ ప్రక్రియలో, ఏర్పాట్ల విషయంలో ఎక్కడా ఎలాంటి లోపాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయి పర్యటన చేసి ఏర్పాట్లను సమీక్షించుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

=================

విద్యుత్ కొనుగోలు ఛార్జీలను తగ్గించే అంశంపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఈ దిశగా చేపడుతున్న చర్యలను మరింత ముమ్మరం చేయాలన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు జరిగిన విద్యుత్ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... కొనుగోలు ధరను యూనిట్ కు 4 రూపాయలు తగ్గించటంతో.. పాటు ప్రజలపై భారం వేయకుండా విద్యుత్ సంస్థల రుణాలు తీర్చేందుకు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. నూతన సాంకేతికతను వినియోగించుకుని విద్యుత్ పొదుపు చర్యలు చేపట్టాలని కోరారు. విద్యుత్ రంగంలోని వివిధ విభాగాల ద్వారా సంస్కరణలు చేపట్టాలన్నారు. ఇంధన రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలని ముఖ్యమంత్రి కోరారు. విద్యుత్ రంగంలో సాంకేతికను, ఆవిష్కరణలను ప్రోత్సహించేలా ఎనర్జీ యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సమీక్షలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

=================

క్షయ వ్యాధి లక్షణాలు కలిగిన వారిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తించేందుకు కృత్రిమ మేధ (ఏఐ) సహాయంతో అత్యాధునిక “హ్యాండ్ హెల్డ్ ఎక్స్-రే” మిషన్లను వినియోగించబోతున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. సుమారు 20 కోట్ల రూపాయలతో 100 మిషన్లను టెండర్ల ద్వారా త్వరలోనే కొనుగోలు చేస్తున్నాయని చెప్పారు. “ప్రపంచ క్షయ దినోత్సవం” సందర్భంగా రాష్ట్రంలో క్షయ వ్యాధిగ్రస్తుల గుర్తింపు, తీసుకుంటున్న చర్యలు, ఇతర అంశాలపై దృశ్య మాధ్యమం ద్వారా అధికారులతో మంత్రి ఈరోజు సమీక్షించారు. కృత్రిమ మేధ అనుసంధానంతో పని చేసే ఈ మిషన్ల ద్వారా ఇళ్ల వద్దనే క్షయ నిర్ధారణ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 4,126 హాట్ స్పాట్ గ్రామాల్లో వీటిని వినియోగిస్తామని స్పష్టం చేశారు. ఈ గ్రామాల్లో ఉన్న 14 ఏళ్లు నిండిన వారందరికీ ఉచితంగా పరీక్షలు చేస్తామని వెల్లడించారు.

విరామం

=================

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న స్వచ్ఛ్ భారత్ మిషన్ కార్యక్రమాలను పశ్చిమ గోదావరి జిల్లాలో పెద్ద ఎత్తున అమలు చేస్తున్నారు. రొయ్యల చెరువుల్లో రసాయనాలతో కూడిన మేత, మందులకు ప్రత్యామ్నాయంగా వర్మీ కంపోస్ట్ తో సాగు చేసిన రొయ్యలను రైతులు అందిస్తున్నారు. జిల్లాలోని 396 గ్రామ పంచాయతీల్లో ప్రతినిత్యం 55 టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. ఇందులో 30 నుంచి 40 టన్నుల తడి చెత్త, 15 టన్నుల వరకు పొడి చెత్తను వేరు వేరుగా సేకరిస్తున్నారు. మరిన్ని వివరాలను దుంపగడప గ్రామ సర్పంచ్ మద్దా విశ్వేశ్వరావు మాట్లాడుతూ...

(వాయిస్ 25 సెకన్లు)

==================

రాష్ట్రంలో పామ్ ఆయిల్ మిల్లుల ఆధునికీకరణకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని రాజామహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి కోరారు. లోక్ సభలో 377 నిబంధన కింద అత్యవసర ప్రజా ప్రాధాన్యత గల అంశంగా ఆంధ్రప్రదేశ్‌లో పామ్ ఆయిల్ ప్రాసెసింగ్ మిల్లుల ఆధునికీకరణ అవసరాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి ఆమె ఈరోజు తీసుకువచ్చారు. దేశంలోనే అత్యధిక పామ్ ఆయిల్ సాగు విస్తీర్ణం కలిగిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2.49 లక్షల హెక్టార్లలో పామ్ ఆయిల్ సాగు జరుగుతుండగా... ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 1.97 లక్షల మంది రైతులకు దీని ద్వారా ఉపాధి లభిస్తోందని చెప్పారు.

==================

రాష్ట్రంలో 150 ఆయుష్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులను ప్రారంభించామని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. 44 కోట్ల రూపాయలతో చేపట్టే ఈ భవనాల నిర్మాణాలు, ఆధునీకీకరణ పనులు వివిధ దశలలో ఉన్నాయని ఈ రోజు విడుదల చేసిన ప్రకటనలో మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ఆయుష్ కేంద్రాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నేషనల్ ఆయుష్ మిషన్ (NAM) 2025-26 వార్షిక ప్రణాళికలో భాగంగా ఆయుష్ శాఖ ఈ నిధులను మంజూరు చేసింది. దీంతో రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఆయుష్ వైద్యశాలల రూపురేఖలు మారనున్నాయని వెల్లడించారు. వీటిలో 90 ఆయుష్ కేంద్రాలకు ఆధునీకీకరణ పనులు చేపట్టగా... 60 ప్రభుత్వ ఆసుపత్రుల్లో నూతనంగా ఆయుష్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు చేపట్టినట్లుగా మంత్రి పేర్కొన్నారు.

==================

పీఎం సూర్యఘర్ పథకాన్ని విజయవంతంగా అమలు చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. భీమవరంలో కలెక్టరేట్ లో ఈరోజు నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... పీఎం సూర్యఘర్ పథకాన్ని జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అమలు చేయాలని కోరారు. ఈ పథకం కింద గృహాలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు ద్వారా విద్యుత్ ఖర్చును తగ్గించడమే కాకుండా పునరుత్పత్తి శక్తి వినియోగాన్ని పెంచగలమని కలెక్టర్ చెప్పారు.

==================

దక్షిణ అంతర్గత కర్ణాటక పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. మన్నార్ గల్ఫ్ నుండి తమిళనాడు దక్షిణ అంతర్గత కర్ణాటక మీదుగా ఉత్తర అంతర్గత కర్ణాటక వరకు ఉన్న ద్రోణి ఈ రోజు సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో కొనసాగుతోందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==================

==================